క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోండి

పెళ్లకూరు: మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రామయ్య తెలిపారు. ఆయన శనివారం కొత్తూరు, నెలబల్లి, పుల్లూరు బీఎల్‌వో కేంద్రాలను పరిశీలించారు. ఈ నెల 9 వరకు ఓటరు నమోదుతోపాటు డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపునకు అవకాశం ఉందని, బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫారం –7 విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనల మేరకే చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపులో రాజకీయ ఒత్తిళ్లు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న రామ్మోహన్‌రావు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని రాజావీధిలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం ఎస్.వి. రత్నం చారిటీస్ అధినేత రామ్మోహన్‌రావు దాతృత్వంతో అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఎస్‌వి రత్నం చనిపోయి 51 ఏళ్లు అవుతోందని, ఆయన జ్ఞాపకార్థం ఎస్.వి.రత్నం చారిటీస్ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.

రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పరిశీలన

గూడూరు రూరల్ : గూడూరు రైల్వే స్టేషన్ మీదుగా ఒకటి, రెండవ పట్టణాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ కోరారు. ఆయన శనివారం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. 2019లో కరోనా కారణంగా అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మూసివేశారని తెలిపారు. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు నవంబరు 8న విజయవాడలో జరిగిన డీఆర్‌యూసీసీ మీటింగ్‌లో ఈ విషయాన్ని డీఆర్‌ఎం నరేంద్ర ఆనంద పటేల్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు బ్రిడ్జిని మళ్లీ వినియోగంలోకి తెస్తున్నట్టు తెలిపారు.

కలువాయి, కుల్లూరులో వడ్డెర్ల పాదయాత్ర

కలువాయి: సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వడ్డెర సంఘం నేతలు అలిపిరి నుంచి విజయవాడకు చేపట్టిన పాదయాత్ర శనివారం కలువాయి చేరుకుంది. కార్యక్రమంలో తురకా అమర్‌నాథ్, బి.శ్రీనివాసులు, వెంకటరమణ, నరేష్, గుంజి రవికుమార్, తిరుపతయ్య, టి.వెంకటేశ్వర్లు, టి.రమణయ్య పాల్గొన్నారు.

నారుమడుల సంరక్షణకు చర్యలు తీసుకోండి

కలువాయి: భారీ వర్షాల కారణంగా వరి నారుమడులు దెబ్బతినకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఏవో వి.ప్రతాప్ తెలిపారు. ఆయన శనివారం వీఏఏలతో సమావేశమై పలు సూచనలు చేశారు. నారుమడుల్లో నీరు నిల్వ ఉండకుండా గడులు కొట్టుకోవాలన్నారు. పచ్చిశనగ సాగు చేసే రైతులు తప్పనిసరిగా శిలీంద్ర నాశినితో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. తుపాను కారణంగా రైతులు పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని వీఏఏలను ఆదేశించారు.

కండలేరులో 11.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 1750 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు భరోసా కల్పించాలి

కోట: దివ్యాంగులకు భరోసా కల్పించాలని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బాలబాలికలకు ప్రోత్సాహకాలు, బహుమతులు, స్వీట్లు అందజేశారు. ఎంపీడీవో భవాని, ఎంఈవో వెంకటసునీల్ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిక్కవరానికి చెందిన కామిరెడ్డి అమరనాథ్‌రెడ్డి, శ్రీలత ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన సుమంత్‌రెడ్డి, పవిత్ర ఉభయదారులుగా వ్యవహరించారు. ఈవో తాతా శ్రీనివాసరావు, గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలకు ప్రత్యేక క్యాంపులు

వెంకటగిరి రూరల్ : ఓటర్ల జాబితాలో సవరణల కోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. ఆయన శనివారం పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాటుచేసిన స్పెషల్ క్యాంపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 44 బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

సంక్షేమమే లక్ష్యంగా జగన్ పరిపాలన


సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరి పట్టణం 10వ వార్డులోని శ్రీనివాసనగర్, యాచేంద్ర నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పథకాలు అందని వారి వివరాలు సేకరించి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే పథకాలు అందించిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. చేసిన మేలును గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, విట్ పి లక్ష్మి, కౌన్సిలర్లు శివ, గోపాలకృష్ణ, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, నారాయణ, వహీద, కందాటి కళ్యాణి, ప్రభావతి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నాయకులు సిహెచ్ మురళీ, రొంటాల చిన్నా, మధుసూదన్, శేఖర్, ఎం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్టు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. నెలబల్లిలో శనివారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, సర్పంచ్ కమలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, ఎంపీడీవో సురేష్‌బాబు, కార్యదర్శి మధుమోహన్ పాల్గొన్నారు.


ధ్వజ స్తంభానికి మొక్కుతున్న మాదాసు గంగాధరం

సంక్షేమ ప్రదాతను మరోమారు ఆశీర్వదించండి

కలువాయి: అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్న సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం పిలుపునిచ్చారు. ఆయన శనివారం కలువాయి మండలం కుల్లూరులోని అచ్యుత స్వామి, పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వివిధ వర్గాల ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూసిన వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలను 99.5 శాతం అమలు చేశారని తెలిపారు. చేసిన మేలును గుర్తించి 2024 ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఉప సర్పంచ్ పొంకు శ్రీనివాసులు, పోతల సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): తుపాను ప్రభావంతో జిల్లాలో 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన శనివారం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కైవల్యా నది, గొడ్డేరు వాగులో ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు అక్కడికి వెళ్లకుండా చూడాలన్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి ఎంపీడీవోలు విజయలక్ష్మి, ప్రసన్నకుమారి, ప్రమీలరాణి, అగ్నిమాపకశాఖ అధికారినారాయణ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఫిర్యాదు


డీటీకి వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు

సైదాపురం: మండలంలోని తిప్పిరెడ్డిపల్లి, పెరుమాళ్లపాడు, పాలూరు గ్రామాల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదబండి ప్రభాకర్‌రెడ్డి కోరారు. వారు శనివారం డీటీ ఎన్.అనురాధ, ఎస్‌ఐ చల్లావాసుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు తమ పార్టీ నేతల పేర్లు వాడుకుంటూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా మేత పోరంబోకు భూముల్లో 30 హిటాచీలతో మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు, సొసైటీ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, నలమారు రాంగోపాల్‌రెడ్డి, వివేక్, సుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎం.పెంచలయ్య, వెంకటేశ్వర్లు, శంకరయ్య పాల్గొన్నారు.

రేపు రైతులకు పట్టాల పంపిణీ

కలువాయి: రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ సోమవారం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు జి.స్వర్ణ తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామాల్లో 655 మంది లబ్ధి దారులను గుర్తించామన్నారు. వారికి ఉమామహేశ్వరి కల్యాణ మండలంలో సోమవారం ఉదయం వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తామని వివరించారు. ప్రస్తుతం తుపాను తీరం దాటనున్న నేపథ్యంలో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, కలువాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

8న అయ్యప్ప స్వామి అఖండ జ్యోతి పూజ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : పట్టణంలో అయ్యప్ప స్వామి అఖండ జ్యోతి పూజోత్సవాన్ని 8న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వారు శనివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పూజోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 42వ జ్యోతి పూజోత్సవాన్ని ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించాలని ఏర్పాట్లు చేశామన్నారు. భారీవర్షాల వల్ల వాయిదా వేసి 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 8న గాంధీ పార్కు సమీపంలో గణపతి హోమంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. కలశాల ఊరేగింపు, రాత్రి అఖండ కర్పూరజ్యోతి తర్వాత అయ్యప్పస్వామి నగరోత్సవం చేపడతామన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం అన్నదానంతో వేడుకలు ముగుస్తాయన్నారు. భగవాన్ అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు వెంకటకృష్ణారెడ్డి, పి.చంద్రారెడ్డి, ఎం.జలందర్, జి.రాజశేఖర్, డీసీ యతీంద్ర, ఈహెచ్ అంకయ్య పాల్గొన్నారు.

జలపాతాల వద్ద ఆంక్షలు


జలపాతాల వద్దకు వెళ్లకుండా రోప్‌లు కడుతున్న అధికారులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలోని జలపాతాల వద్దకు భక్తులు వెళ్లకుండా ఆంక్షలు విధించినట్టు ఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా పెంచలకోనలోని జలపాతాలు ఉద్ధృతంగా ప్రవహిస్తాయని తెలిపారు. వాటిని చూసేందుకు వచ్చే భక్తులు కొండల్లో చిక్కుకుని ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే అనుమతిస్తున్నట్లు తెలిపారు.

15 వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

రాపూరు: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 15 వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పాజి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నామని వివరించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో డ్రైవ్‌ను చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఉంటే 9655407574 తెలియజేయాలని కోరారు.

వృద్ధురాలి మృతి

రాపూరు: రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలోని మసీదుపేట వద్ద ఉన్న బస్ షెల్టర్ వద్ద వృద్ధురాలి మృతదేహాన్ని శనివారం గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె కోట మండలం కండ్రి గ్రామానికి చెందిన తులసమ్మ(65)గా గుర్తించినట్టు తెలిపారు. ఆమె భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోందని, ఆమె సంచిలో ఉన్న ఆధారాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు

వెంకటగిరి రూరల్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కుమ్మరిగుంటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామిని మహావిష్ణువుగా అలంకరించారు. అయ్యప్ప భక్తులు భజనలు చేశారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి


డక్కిలి: వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐ


ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న సీఐ దశరథ రామారావు

డక్కిలి : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఎస్‌ఐ నాగరాజు, ఎంఈవో 2 జగదీష్, ఏపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 3, 4, 5 తేదీల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీలు 24 గంటలు వైద్య సేవలు అందించేలా చూడాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సివిల్ సప్లయీస్ అధికారులు ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు మండల కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: నెల్లూరు–చెన్నై ప్రాంతాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉండడం వల్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామయ్య తెలిపారు. ఆయన శనివారం అధికారులతో సమీక్షించారు. మారుమూల గ్రామాల్లో అధికారులు బస చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం స్వర్ణముఖి నది తీర ప్రాంతాలకు వెళ్లి స్థానికులను అప్రమత్తం చేశారు. కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిపై ఉన్న చెక్‌డ్యామ్‌ను రాత్రి దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సురేష్ బాబు, ఎస్‌ఐ శ్రీకాంత్, ఏవో ప్రవీణ ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గూడూరు రూరల్ : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బూదూరు గురవయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పొందేందుకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాల పత్రాలను విద్యుత్ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ–2 ఇంద్రాణి, ఎంపీటీసీ మంజుల పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్ : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ తెలిపారు. ఆయన శనివారం మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది విధుల్లోనే ఉండాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పల్లపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండండి

చిల్లకూరు : వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని గూడూరు రూరల్ సీఐ దశరథ రామారావు తెలిపారు. ఆయన శనివారం తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం గ్రామాల వద్ద ఉన్న చప్టాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో వంకలు, వాగులు, చెరువులు, నదుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయా ప్రాంతాలలోని సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తామని, అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తిప్పగుంటపాళెం వద్ద ఉన్న ఉప్పుటేరుకు వరద వచ్చే ప్రమాదం ఉందని, అలాగే తీపనూరు, నెలబల్లిరెట్టపల్లి వద్ద ఉన్న కాజ్‌వే వద్ద కూడా కాపలా ఏర్పాటు చేస్తామన్నారు.

సమన్వయంతో తుపానును ఎదుర్కొందాం

చిల్లకూరు : తుపాను ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి విపత్తును ఎదుర్కొందామని ఎంపీడీవో వెంకటసూర్యసాయి పిలుపునిచ్చారు. ఆయన శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలోని బకింగ్ హామ్ కెనాల్ ఆవలి వైపున ఉన్న వారికి ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ప్రజలు వ్యాధులబారిన పడకుండా చూడాలని తెలిపారు. చెరువు కట్టల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్ : యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోసమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు వచ్చినా ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారుల కోసం మరుగుదొడ్లు, వాకర్స్‌కు నడకదారి, జిమ్, రన్నింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ శివకుమార్, ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ కోఆర్డినేటర్, శాప్ గూడూరు సబ్ సెంటర్ హాకీ కోచ్ దీపక్ ఆకాష్, యమహా సుబ్రమణ్యం, అజీజ్‌ఖాన్, సుమన్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



పెంచలకోనలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అభిషేకం, సుప్రభాతం, పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అనంతరం విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి


రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు : ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండలంలో శనివారం ఓటరు జాబితాలో చేర్పులు, సవరణలకు బీఎల్‌వోలతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన వాటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ డోర్ నంబర్ కచ్చితంగా ఉండాలని, లేని వాటికి పక్కన ఉన్న ఇంటి నంబర్‌కు అదనపు నంబర్ వేసి నమోదు చేయాలన్నారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే పక్కన మరో నంబర్ వేసి వేరు చేయాలన్నారు. వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


అవినాష్‌ను సన్మానిస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

గూడూరు రూరల్ : గూడూరుకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు అవినాష్ జాతీయ స్థాయి క్రికెట్ జట్టులో స్థానం పొందడం గర్వంగా ఉందని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో శనివారం అవినాష్‌ను రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అవినాష్ అంతర్రాష్ట్ర దివ్యాంగుల గేమ్స్‌లో షాట్ పుట్‌లో బంగారు, జావెలిన్ త్రోలో రజత పతకాలను సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం అవినాష్‌ను సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్‌రావు, వాసుగౌడ్, ధనుంజయరెడ్డి, రవీందర్‌రెడ్డి, సేగు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లూరి శ్రీనివాసులు, బొమ్మిడి శ్రీనివాసులు, గిరిబాబు పాల్గొన్నారు.

ప్రవహిస్తున్న కైవల్యానది



ఎడతెరపి లేని వర్షం

సైదాపురం: మండలంలో శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు ప్రజలను కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అలాగే మండలంలో ప్రవహిస్తున్న పిన్నేరు, మాలేరు, కైవల్యానదుల వల్ల ప్రమాదం జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని చెరువుల్లోకి నీరు చేరిందని వివరించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. చెరువుల్లోకి నీరు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో శనివారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. తహసీల్దార్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఎస్‌ఐ నరసింహారావు లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. కైవల్యానదీ ప్రాంతాన్ని పరిశీలించారు.


రాపూరులో కురుస్తున్న వర్షం